క్లుప్తంగా

పండ్ల తోటలకు వంద శాతం సబ్సిడీ

యాదమరి: ఉపాధి హామీ పథకంలో పండ్లతోటలు పెంచేందుకు వందశాతం సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించనున్నట్లు యాదమరి ఏపీఓ బాల తెలిపారు. ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో 2024–25 సంవత్సరానికి గాను ఉపాధిహామీ పథకంలో పండ్ల తోటలు పెంచుకోవడానికి, పంట వేసిన తరువాత కాపలాదారులకు, పండ్ల మొక్కలకు నీరు పోయడానికి వంద శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ పథకాలకు 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు, రేషన్ కార్డు కలిగి ఉన్నవారు ఫీల్డ్ అసిస్టెంట్‌ల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆపస్ డైరీ ఆవిష్కరణ



ఆపస్ డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నూతన డైరీని డీఈఓ విజయేంద్రరావు శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ ఆపస్ రూపొందించిన డైరీ, క్యాలెండర్ బాగున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ, జిల్లా అధ్యక్షులు మంజునాథగుప్త, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, గౌరవాధ్యక్షులు మేకల సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకులు చిట్టిబాబు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

తవణంపల్లె: వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. మండలంలో కొత్త పింఛన్లు 153 మందికి మంజూరు కాగా, ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున పింఛను డబ్బులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వరసిద్ధుని సేవలో సినీ నటుడు



వినాయకుని సేవలో గరుడ రామచంద్రరాజు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని సినీ నటుడు గరుడ రామచంద్రరాజు శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన స్వామివారి దర్శనార్థం కుటుంబంతో విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యఅన్నదానానికి తిరుపతికి చెందిన సతీష్ రూ.లక్ష విరాళంగా అందించారు. దాత కుటుంబ సమేతంగా శుక్రవారం సాయంత్రం స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అధికారుల వద్ద స్వామివారి నిత్య అన్నదానానికి రూ.లక్ష అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన అయోధ్య అక్షింతలు



189 కొత్తపల్లెలో అక్షింతలను భక్తులకు అందజేస్తున్న రామభక్తులు

గుడిపాల: గ్రామ గ్రామాన అయోధ్య రాముల అక్షింతలను అందజేయనున్నట్లు అయోధ్య రాముడి భక్తులు అన్నారు. మండలంలోని 189కొత్తపల్లె, ఆదిఆంధ్రవాడ, కిల్లారిపల్లె గ్రామాల్లో శుక్రవారం రామ భక్తులు గ్రామ వీధుల్లో తిరిగి అన్ని కుటుంబాలకు అక్షింతలను అందజేశారు. ఈ అక్షింతలను పూజగదిలో ఉంచి జనవరి 22వ తేదీన అయోధ్య రామమందిరం ప్రారంభ సమయంలో తలపై చల్లుకోవాలని సూచించారు. భజనలు, కోలాటాలతో గ్రామాల్లోని అన్ని కుటుంబాలకు అక్షింతలను అందజేశారు.

సర్కారు ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యం



పి.కొత్తకోటలో ఆధునీకరించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్



సరికొత్తగా ఏర్పాటు చేసిన పడకలపై వైద్యం పొందుతున్న రోగులు

నాడు: ప్రభుత్వ ఆస్పత్రులంటే.. శిథిలావస్థలో ఉన్న భవనాలు, విరిగిపోయిన కుర్చీలు, బల్లలు, తెరుచుకోని తలుపులు, అందుబాటులో లేని మందులు, విధులకు డుమ్మా కొట్టే వైద్యులు.. చెత్తా చెదారంతో నిండిపోయిన గదులు.. ఆ దరిదాపుల్లో కనిపించని రోగులు

నేడు: ప్రభుత్వ ఆస్పత్రులంటే.. ఆధునీకరించిన భవనాలు, సరికొత్త ఫర్నిచర్, నిరంతరం పని చేసే కేంద్రాలు, సహృదయంతో సేవలందించే వైద్యులు, అందుబాటులో అన్ని రకాల మందులు, ల్యాబ్ పరికరాలు, స్కానింగ్ యంత్రాలు, పరిశుభ్రంగా కనిపించే గదులు, క్యూ కడుతున్న రోగులు..

ఇదీ గత టీడీపీ పాలనకు, నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు తేడా!

- ఏడు రకాల వైద్య నిపుణులతో సేవలు
- అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్యం
- పి.కొత్తకోట సీహెచ్‌సీకి పెరుగుతున్న రోగుల తాకిడి

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రం చుట్టు పక్కల 5 మండలాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుతున్నాయి. జగనన్న ప్రభుత్వం అధికారంలో రాగానే శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ సామాజిక కేంద్రాల రూపురేఖలను మార్చారు. అదనపు భవనాల కోసం రూ.30 లక్షలను మంజూరు చేసి ఓపీ బ్లాక్ నిర్మాణం పూర్తి చేసింది. చుట్టు పక్కలనున్న పెనుమూరు, పాకాల, సదుం, కల్లూరు, ఐరాల, పూతలపట్టు మండలంలోని ప్రజలు వచ్చి సేవలందుకుంటున్నారు. కార్పొరేట్ హాస్పిటల్ స్థాయిలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. నాడు–నేడు కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టడంతో సీహెచ్‌సీ, పీహెచ్‌సీల రూపురేఖలు మారాయి.

పెరిగిన రోగుల సంఖ్య

గతంలో చిన్నపాటి జ్వరం వచ్చినా స్థానికంగా ఆర్‌ఎంపీ లేదా ప్రైవేటు క్లినిక్‌లను ప్రజలు ఆశ్రయించేవారు. దాంతో సీహెచ్‌సీలలో రోజుకు 100 మంది కూడా వైద్యం పొందేవారు కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరుగాత వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. తద్వారా ప్రస్తుతం సీహెచ్‌సీల్లో అన్ని రకాల వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుతున్నాయి. రోగుల అవసరాలకు అనుగుణంగా ఆస్పత్రుల్లో ఆధునిక వసతులు సమకూర్చుతున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో రోగుల తాకిడి పెరుగుతోంది. ప్రస్తుతం రోజుకు 320 మంది వైద్య సేవలు పొందుతున్నారు. క్రమంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపై నమ్మకం పెరుగుతోంది. పి.కొత్తకోట సీహెచ్‌సీ పరిధిలో పూతలపట్టు, పేటమిట్ట, కాణిపాకం, ఐరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

సురక్ష ప్రసవాలు

వైద్య సిబ్బంది నిత్యం గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పిస్తుండడంతో ప్రసవాల సంఖ్య పెరిగింది. నెలకు సుమారు 20 ప్రసవాలు సీహెచ్‌సీలో వైద్యులు చేస్తున్నారు. గర్భిణులు ప్రతి బుధవారం ఆస్పత్రికి విచ్చేసి పరీక్షలు చేసుకుంటున్నారు. అదే రీతిలోనే గర్భిణులకు సురక్షితంగా ప్రసవాలు చేసి తల్లీబిడ్డను క్షేమంగా ఇల్లు చేరుస్తున్నారు. సుఖ ప్రసవం సాధ్యం కాని పక్షంలో అత్యవసర పరిస్థితిలో శస్త్రచికిత్స ద్వారా కాన్పు చేస్తున్నారు.

21 రకాల వైద్య పరీక్షలు

సీహెచ్‌సీలో వ్యాధి నిర్ధారిత పరీక్షలకు అత్యాధునిక ల్యాబ్ పరికరాలను ప్రభుత్వం సమకూర్చింది. దీంతో ఈ ఆస్పత్రిలోనే రోగులకు 21 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. వీటిలో హెచ్‌బి టెస్ట్, ఆర్బీఎస్, హెచ్‌బీసీ, విడాల్ టెస్ట్, సీఆర్పీ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్(గుండె సంబంధిత) పరీక్షలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, రక్త పరీక్ష, యూరిన్, గర్భిణులు, హెచ్‌ఐవీ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు. గుండె పోటుకు సంబంధించి కార్డియాలజిస్ట్ అభిప్రాయంతో ఇంజక్షన్ అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇక్కడ ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులు మాత్రమే అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం అస్పత్రి స్థాయి పెంచిన నేపథ్యంలో గైనకాలజీ, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, అనస్థీషియా, దంత వైద్య నిపుణుడు, ఫిజియోథెరపి, జనరల్‌తో కలిపి 8 మంది స్పెషలిస్టు డాక్టర్లు ఉన్నారు. ఆస్పత్రిలో 50 మంది సిబ్బంది ఉన్నారు.

పైసా ఖర్చు లేకుండా వైద్యం



ఇంటి వద్ద పనిచేస్తుండగా చేతికి దెబ్బతగిలింది. దీంతో చేతితో పని చేసేందుకు ఇబ్బంది ఉండేది. ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో పి.కొత్తకోట సీహెచ్‌సీకి వచ్చాను. ఆర్థోపెడిక్ డాక్టర్ నన్ను పరీక్షించారు. ఉచితంగా ఎక్స్‌రే తీశారు. మందులు కూడా ఇచ్చారు. ఇంత మెరుగైన వైద్యం ఉచితంగా అందించారు.

– శాంతమ్మ, పూతలపట్టు

సేవలు భేష్



నా కొడుకు పేరు హర్షవర్ధన్‌కు మూడు రోజుల నుంచి జ్వరం విపరీతంగా ఉండడంతో పాకాల పట్టణంలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కి తీసుకెళ్లాను. అయినప్పటికి జ్వరం తగ్గకపోవడంతో పి.కొత్తకోటలోని సీహెచ్‌సీకి వచ్చాము. డాక్టర్లు పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. మందులు వాడాక జ్వరం తగ్గిపోయింది. ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యం అందుతోంది.

–నీరజ, పాకాల మండలం

ఉచితంగా అద్దాలు



పి.కొత్తకోట సీహెచ్‌సీలోని ముఖ్యమంత్రి ఈఐ కేంద్రంలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటిద్దాలు అందజేశారు. బయట ప్రైవేటు ఆస్పత్రుల్లో చేసుకుంటే అధిక ఖర్చయ్యేది. పి.కొత్తకోటలోని ఈఐ కేంద్రానికి వస్తే ఆధార్ కార్డు తీసుకొని పరీక్షలు చేశారు. 15 రోజుల తర్వాత ఉచితంగా నాణ్యమైన కళ్లద్దాలు అందజేశారు. సీఎంకు రుణపడి ఉంటాం.

–జయకుమార్, చిత్తూరు

24 గంటలూ అందుబాటులో..



పి.కొత్తకోట సామాజిక ఆస్పత్రిలో 24 గంటలూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగి పరిస్థితిని బట్టి సంబంధిత వైద్యుడితో వైద్యం అందిస్తున్నాం. సీరియస్ కేసులు ఉంటే, చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తున్నాం. ప్రభుత్వం నాణ్యమైన మందులు అందిస్తుండడంతో రోగుల సంఖ్య పెరుగుతోంది.

– డాక్టర్ పావని చంద్ర,
జనరల్ సర్జన్, సీహెచ్‌సీ, పి.కొత్తకోట

నేడు ఉచిత వైద్య శిబిరం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ సమీపంలో తిరుపతికి చెందిన ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వారు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. స్వామివారి ఆస్థాన మండపంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించి వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఆలయ సిబ్బంది, స్థానికులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

డీఈఓ దృష్టికి సమస్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల సమస్యలను అపుస్మా సంఘం నాయకులు డీఈఓ విజయేంద్రరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆ సంఘం నాయకులు డీఈఓను కలిశారు. ప్రైవేట్ పాఠశాలల అనుమతుల మంజూరులో ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని డీఈఓను కోరారు. కార్యక్రమంలో అపుస్మా సంఘం నాయకులు మహేష్, ఎస్ఎస్‌కే.రాజా పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ అరుణ శుక్రవారం పరిశీలించారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, కార్పొరేటర్ శశి కుమార్, స్థానిక యువతతో కలిసి శుక్రవారం ఉదయం నగరపాలక పరిధిలోని వన్నియర్ బ్లాక్ వీధులను కమిషనర్ శుభ్రం చేశారు. మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మిక సమ్మె నేపథ్యంలో నగరంలో పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. బజారు వీధి, డీఐ రోడ్డు, వన్నియర్ బ్లాక్ ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ, కార్మికుల సమ్మె నేపథ్యంలో, ప్రత్యామ్నాయ విధానాల ద్వారా దినసరి కార్మికులను ఉపయోగించి పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

సయ్యద్‌కు సన్మానం



సయ్యద్‌ను సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సయ్యద్ సర్దార్‌ను మైనారిటీ నాయకులు సన్మానించారు. చిత్తూరులో శుక్రవారం సయ్యద్‌ను కలిసి మాట్లాడారు. మైనారిటీల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తానని సయ్యద్ తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు గఫార్‌ఖాన్, అను, అబ్దుల్, రషీద్, అక్మల్‌ఖాన్, తాజ్, మోహిద్ తదితరులు ఉన్నారు.

అవధానం అభినందనీయం



బహుమతులు పొందిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : ఒకేసారి 30 మంది విద్యార్థులతో గణిత అవధానం నిర్వహించడం అభినందనీయమని విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి అన్నారు. నగరంలోని మిట్టూరులో ఉన్న విజయం డిగ్రీ కళాశాలలో శుక్రవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం గణిత అవధానంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రేషన్ పంపిణీ పరిశీలన

పూతలపట్టు: మండలంలోని రంగంపేట క్రాస్‌లో శుక్రవారం రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న వాహనం వద్దకు తహసీల్దార్ విజయభాస్కర్ వెళ్లి పరిశీలించారు. రేషన్ కార్డుండి సరుకులు అందకపోతే వీఆర్వోలకు సమాచారాన్ని తెలియజేయాలన్నారు. శుక్రవారం వరకు మండలంలో 28 శాతం మంది సరుకులు తీసుకున్నట్లు తెలిపారు.



మొబైల్ వ్యాన్ వద్ద తహసీల్దార్ విజయభాస్కర్

రోడ్డుపై గుంతల పూడ్చివేత



గుడిపాల: మండలంలో గత నెలలో కురిసిన వర్షాలకు పానాటూరు వద్ద చిత్తూరు–వేలూరు రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. రెండురోజుల క్రితం ఓ బస్సు గుంతల వద్ద సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వైపు వస్తున్న మరో బస్సు ఢీకొంది. ఈ నేపథ్యంలో శుక్రవారం చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గుంతల్లో మట్టి తోలి పూడ్చేశారు.

అర్హులందరికీ పెంచిన పింఛన్లు పంపిణీ

- అవ్వాతాతల కళ్లలో నిండిన ఆనందం
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



చిత్తూరు: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతల కళ్లల్లో ఆనందం నింపుతున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటికి పెద్ద కొడుకుగా నిలిచి పేద కుటుంబాలను ఆదుకుంటానని ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చిందన్నారు. అన్నమాట ప్రకారం పింఛన్ రూ.3 వేలకు పెంచడంతో అవ్వాతాతలే కాదు వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల కళ్లల్లో సంతోషం వెల్లివిరిస్తోందన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పెత్తనంతో పింఛన్ల మంజూరు కష్టతరంగా మారిందన్నారు. ఇప్పుడు అలా లేదని పార్టీలకు అతీతంగా పింఛన్‌లు అందజేస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు జయరాం, రంజని, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు సంపత్, బాబు, దిలీప్ పాల్గొన్నారు.

బంగారుపాళెం: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం–1 ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ ఉమాదేవి అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, అధికారులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డితో కలిసి మండలంలో కొత్తగా మంజూరైన 196 మందికి పింఛన్లను అందజేశారు.

ఐరాల: 2019 సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదక్కుతుందని పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎం.పైపల్లె సచివాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అవ్వాతాతలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3 వేలకు పెంచి దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇచ్చే ప్రభుత్వంగా నిలిచిందన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నకు ప్రజల ఆశీర్వాదాలు మెండుగా ఉన్నాయని చెప్పారు.





బంగారుపాళెం: కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఐరాల: పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

గుడిపాల: వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 189 కొత్తపల్లెలో గ్రామస్తులకు గ్రామపంచాయతీల విస్తరణాధికారి కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అయుష్మాన్‌భారత్, పీఎం గరీబ్ కళ్యాణ్ యోజన, ఆవాస్‌యోజన, ఉజ్వల్‌యోజన, కిసాన్‌క్రెడిట్ కార్డు తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాధవి, డాక్టర్ సంధ్య, సర్పంచ్ పెరిల్లా, హౌసింగ్ ఏఈ గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం

చిత్తూరు కలెక్టరేట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని దేవిబాలమందిర్ హెచ్ఎం సుజాత అన్నారు. ఆ పాఠశాల వ్యవస్థాపకులు త్యాగరాజన్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆ పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ నటా జనవరి 5న తమ పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవస్థాపకులు త్యాగరాజన్ సేవా దృక్పథాన్ని చిన్నపిల్లలకు అలవర్చాలనే ఉద్దేశంతో పాఠశాలను నెలకొల్పారన్నారు. అనంతరం ఈ శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు సహదేవనాయుడు, టీచర్లు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పూర్వవిద్యార్థి

పక్కాగా ఆరోగ్య సురక్ష -2 సర్వే

చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష –2కు సంబంధించి ఇంటింటి సర్వే పక్కాగా పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ వార్డు ఆరోగ్య కార్యదర్శులను ఆదేశించారు. కమిషనర్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, జగనన్న ఆరోగ్య సురక్ష –2, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, ఆడుదాం ఆంధ్ర అంశాలపై శుక్రవారం మధ్యాహ్నం వార్డు కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష –2 కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను సమన్వయం చేసుకొని వందశాతం సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, సీఎంఎం గోపి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గొడుగుచింతలో....

పూతలపట్టు: మండలంలోని గొడుగుచింత పంచాయతీ పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. గొడుగుచింత, వేనూతనపల్లి పంచాయతీ పరిధిలోని 395 మంది ఉచితంగా వైద్య సేవలు, మందులు అందుకున్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగులు, ఆరోగ్య శ్రీ కార్డులను అందజేశారు.

పల్లెల్లో కార్పొరేట్ వైద్యం

బంగారుపాళెం: గ్రామాల్లో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందజేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని శెట్టేరి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అందులో 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఇచ్చారు.

ఆరోగ్య సమాజమే లక్ష్యం

ఐరాల: ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 254 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.







చిత్తూరు: వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ అరుణ, ఐరాల: కళ్లజోడు అందిస్తున్న డాక్టర్ రాజేశ్వరి, బంగారుపాళెం: శిబిరంలో వైద్య సేవలు